



# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 13-06-2024 | సంపుటి : 06 | సంచిక : 270 | పేజీలు : 8 | వెల : రూ






**సిఎంగా చంద్రబాబు ప్రమాణం**
**కొలువుదీరిన కొత్త ప్రభుత్వం**
**పవన్ కళ్యాణ్, లోకేశ్ తదితరుల ప్రమాణం**
**ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్**
**హాజరైన ప్రధాని మోడీ,అమిత్ షా, గడ్కరీ తదితరులు**
**కార్యక్రమంలో మార్మోగిన చంద్రబాబు, టిడిపి నినాదాలు**










విజయవాడ,జూన్12 : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గత ఎన్నికల్లో అతిపెద్ద విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబుతో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్‌తో పురంధేశ్వరి, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ గవర్నర్ తమిళసై, మాజీ సిఎం పన్నీరు సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు. పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి,



రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు వచ్చారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించు కున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో... పవన్ కల్యాణ్ (జనసేన), నారా లోకేశ్ (తెదేపా), అచ్చెన్నాయుడు (తెదేపా),కొల్లు రవీంద్ర (తెదేపా), . నాదెండ్ల మనోహర్ (జనసేన),పి. నారాయణ (తెదేపా), వంగలపూడి అనిత (తెదేపా), సత్యకుమార్ యాదవ్ (భాజపా),నిమ్మల రామానాయుడు (తెదేపా), ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా), పయ్యావుల కేశవ్ (తెదేపా), అనగాని సత్యప్రసాద్ (తెదేపా),కొలుసు పార్థసారథి (తెదేపా), డోలా బాలవీరాంజనేయస్వామి (తెదేపా),గొట్టిపాటి రవి (తెదేపా), కందుల దుర్గేశ్ (జనసేన), గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా), బీసీ జనార్దన్‌రెడ్డి (తెదేపా), టీజీ భరత్ (తెదేపా),ఎస్.సవిత (తెదేపా), వాసంశెట్టి సుభాష్ (తెదేపా), కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా), మందిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (తెదేపా) ఉన్నారు. ప్రమాణం చేసిన వారంతా తెలుగులోనే దైవసాక్షిగా ప్రమాణాం చేశారు. ఎన్‌ఎండి ఫరూక్ తెలుగులోనే అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. టిజి భరత్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఒక్కొక్కరే ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఇతర పెద్దలకు అభివాదం చేశారు. చంద్రబాబు పలువురిని మోడీకి పరిచయం చేశారు. పవన్ కళ్యాణ్ వేదికపై అందరికి అభివాదం చేసి, తన అన్న చిరంజీవికి మాత్రం పాదాభివందనం చేశారు.

## తొలుత పవన్ కళ్యాణ్.. తరవాత లోకేశ్

### మంత్రిగా రెండోసారి ప్రమాణం



విజయవాడ,జూన్12: మంత్రిగా నారా లోకేష్ ప్రమాణ స్వీకారం చేశారు. నారా లోకేష్‌తో గవర్నర్ అబ్దుల్ నజీర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఎమ్మెల్యేగా గెలవలేరంటూ వైసీపీ చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదు. చివరకు బాడీ షేమింగ్‌కు సైతం వెనుకాడలేదు. ఇష్టానుసారంగా లోకేష్‌పై విమర్శలు గుప్పించారు. వాటన్నింటికీ ఈ ఎన్నికల్లో నారా లోకేష్ తన విజయంతో సమాధానం చెప్పారు. వైసీపీ నేతలెవ్వరికీ మాటల్లేకుండా చేశారు. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని ఎమ్మెల్సీగా ఆపై.. మంత్రి పదవి చేపట్టారంటూ వైసీపీ చేసిన ఎద్దేవాకు గట్టి సమాధానం నారా లోకేష్ చెప్పారు. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత పవన్ కళ్యా ణ్ తరవాత లోకేశ్ ప్రమాణం చేయడంతో వారి స్థాయిని తెలియచేశారు.



## అధికా మెజార్టీ ఇవ్వడంతో ప్రజల హెచ్చరిక

*అప్రమత్తంగా ఉండాలన్నదే ప్రజల ఆకాంక్ష*
*అందుకు అనుగుణంగా పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారు*
*బిజెపి పదాధికారుల సమావేశంలో పురంధేశ్వరి*




విజయవాడ,జూన్12: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అనూహ్యమైన విజయాన్ని సాధించిందని, ఇది చిన్న విజయం కాదు.. అద్భుతమైన విజయమని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ఈ విజయంలో మనకు ఒక హెచ్చరిక, గమనిక ఉంది. గడచిన ఐదేళ్లలో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. గత ప్రభుత్వం వ్యవహరించిన తీరుతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఆమె అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆమె ఈ మేరకు మాట్లాడారు.ధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేయకపోతే ప్రజలు గుణపాఠం చెప్పగలమని ఈ ఫలితాల ద్వారా నిరూపించారని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరించిందని, 164 సీట్లతో ఇంత పెద్ద మెజారిటీ కూటమికి వస్తుందని ఎవరూ ఊహించలేదని, ఇదొక నిశ్శబ్ద విప్లవమని పురందేశ్వరి అన్నారు. తెలుగు ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, కూటమికి అధికారం ఇచ్చిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు అని ఆమె అన్నారు. టిక్కెట్లు రాకపోయినా హైకమాండ్ నిర్ణయానికి అనుగు ణంగా ప్రతి ఒక్కరూ పనిచేయడం శుభపరిమాణమని అన్నారు. ఢిల్లీలో అగ్రనేతలు కూటమి విజయాన్ని అద్భుతంగా పొగుడుతున్నారని, బీజేపీ తరపున సమన్వయ కమిటీలు వేశామని ఆమె అన్నారు. సమన్వయంగా ఉంటూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో తీసుకుపోవాలని ఆమె పేర్కొన్నారు .రాష్ట్రంలో అమరావతి, పోలవరం నిర్మాణం మన ప్రాధాన్యత. అమరావతిలో ఐదేళ్ల తర్వాత విద్యుత్ లైట్లు వెలుగుతున్నాయి. అమరావతి, పోలవరం నిర్మాణంపై సమన్వయంతో ముందుకు వెళతాం. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. ప్రతిపక్షం లేదు... ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపైనే ఉంది.

## ఏపీలో కొత్తగా ఏర్పడ్డ కూటమి మంత్రులు వీరే

అమరావతిజూన్ 12( : ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడ్డ నూతన ప్రభుత్వంలో మొత్తం 25 మంది బుధవారం మంత్రులు గా ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు తో పాటు పవన్ కల్యాణ మరో 22 మంది ప్రమాణం చేసినవారిలో ఉన్నారు. 25మందిలో 17 మంది కిపైగా కొత్తవారికి అవకాశం ఇచ్చారు చంద్రబాబు. ముగ్గురు మహిళలు ఎనిమిది మంది బీసీలు , ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశం కల్పించారు. మరో స్థానాన్ని ఖాళీగా ఉంచారు.

1. నారా చంద్రబాబు నాయుడు (కుప్పం)
2. కొణిదెల పవన్ కళ్యాణ్ ( పిఠాపురం)
3. కింజరాపు అచ్చెన్నాయుడు (టెక్కలి)
4. కొల్లు రవీంద్ర (మచిలీపట్నం)
5. నాదెండ్ల మనోహర్ (తెనాలి)
6. పి.నారాయణ (నెల్లూరు సిటీ)
7. వంగలపూడి అనిత (పాయకరావుపేట)
8. సత్యకుమార్ యాదవ్ (ధర్మవరం)
9. నిమ్మల రామానాయుడు (పాలకొల్లు)
10. ఎన్.ఎమ్.డి.ఫరూక్ (నంద్యాల)
11. ఆనం రామనారాయణరెడ్డి (ఆత్మకూరు)
12. పయ్యావుల కేశవ్ (ఉరవకొండ)
13. అనగాని సత్యప్రసాద్ (రేపల్లె)
14. కొలుసు పార్థసారథి (నూజివీడు)
15. డోలా బాలవీరాంజనేయస్వామి (కొండేపి)
16. గొట్టిపాటి రవి కుమార్ (అద్దంకి)
17. కందుల దుర్గేష్ (నిడదవోలు)
18. గుమ్మడి సంధ్యారాణి (సాలూరు)
19. బీసీ జనార్ధన్ రెడ్డి (బనగానపల్లె)
20. టీజీ భరత్ (కర్నూలు)
21. ఎస్.సవిత (పెనుకొండ)
22. వాసంశెట్టి సుభాష్ (రామచంద్రాపురం)
23. కొండపల్లి శ్రీనివాస్ (గజపతినగరం)
24. మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి (రాయచోటి)
25. నారా లోకేష్ (మంగళగిరి)





# సంపాదకీయం

**గురువారం 13-06-2024**

## ప్రజాస్వామ్యమే తెలుగుదేశం పునాది !

భారతదేశం పునాదులే ప్రజాస్వామిక వ్యవస్థపై ఉన్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఇదే విధానం అవలం బించి, ప్రజల్లో ఉన్నంత కాలం మనగలుగుతాయి. అలాకాకుండా ఏకపక్ష, నిరంకుశ, కుటుంబ పాలనకు కట్టుబడితే అవి కాలక్రమంలో అంతర్థానం అవుతాయి. తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ ఎన్టీ రామారావు ఓ ఉదాత్త ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఉన్నంత కాలం పార్టీని అదే ఆశయం తో నడిపించారు. పార్టీ ఏర్పాటుతో బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రవేశం దక్కింది.ఎందరికో టిడిపి రాజకీయ ఆశ్రయం ఇచ్చింది. ఎందరో రాజకీయాంగా ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా మార్పులు తీసుకుని రావడంలో టిడిపి కీలక భూమిక పోషించింది.ఎన్నో ఒడిదుడు కులు ఎదుర్కొన్నా ప్రజల్లో నిరంతరంగా నిలిచి వారితో కలసి నడిచింది. ప్రధానంగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు రాజకీయ వేదికగా నిలిచింది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం నింపింది. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు అందుకున్నాక కూడా పార్టీని నిరంతరం ప్రజల్లో ఉండేలా చేయడంలో విజయం సాధించారు. ఆ మేరకు కృతకృత్యులు అయ్యారు. ఇది ప్రజల పార్టీ అని నిరూపించారు. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా..లేకున్నా ప్రజల్లో నిలవడానికి కూడా కారణం అదే. అంకితభావం కలిగిన కార్యకర్తలు తోడుగా ఉన్నారు. పార్టీలోకి ఎందరో వచ్చినా..ఎందరో వెళ్లినా, అధికారం లో ఉన్నా, అధికారం లో లేకున్నా పార్టీ మాత్రం చెక్కుచెదరలేదు. ఓ రకంగా చెప్పాలంటే చంద్రబాబు దక్షతకు ఇది నిదర్శనం. దేశంలో ఎన్నో పార్టీలు వచ్చాయి. పోయాయి. ఎందరో తెరమరుగు అయ్యారు. ఎన్నో పార్టీలు ప్రజల నుంచి దూరం అయ్యాయి. అయితే టిడిపి మాత్రం తన ఉనికిని చాటుతూ ప్రజల్లో నిరంతరంగా ఉండేలా ఎప్పటి కప్పుడు తన ప్రణాళికలు మార్చుకుంటూ ముందుకు సాగడంలో నాయకత్వం చేస్తున్న కృషిని అభినందిం చాల్సిందే. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో, ఓ 15 ఏళ్లు విపక్షంలో ఉన్నా.. పార్టీని ఎక్కడా పట్టు సడలకుండా కాపాడుకోగలిగారు. కొందరు నేతలు పార్టీని విడిచి వెళ్లినా పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో జగన్ చంద్రబాబునే టార్గెట్ చేసి,టిడిపిని అణచివేయాలని చూశారు. కేసులతో నేతలను జైల్లో వేయించారు. అలాగే అనేక రకాలుగా విధ్వంస పాలన చేసారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పట్టించుకోలేదు. ఇదంతా విపక్షాల దుష్ప్రచారంగా ప్రచారం చేశారు. అయినా టిడిపి ఎక్కడా చెక్కుచెదరలేదు. తన పట్టును వీడలేదు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేసింది. ప్రజల్లో విశ్వాసం కలిగించింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో గట్టిగా నిలబడ గలిగిన పార్టీల్లో తెలుగుదేశం ముందుంటుంది. తమిళనాట అధికారంలో ఉన్న డిఎంకె కూడా అలాగే నిలిచింది. జయలలిత మరణం తరవాత అన్నాడిఎంకె ఇప్పుడు అంతర్థానం దశలో ఉంది. కర్నాకటలో జనతాదల్ యూ కూడా అదే దశలో ఉంది. తెలంగాణలో కూడా బిఆర్ఎస్ అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. ప్రజలు ఆదరించి అక్కున చేర్చు కుంటే కేసిఆర్ వారికే పంగనామాలు పెట్టి, పాలనలో దొరలపోకడలను చొప్పించి, నిరంకుశ విధానాలకు పట్టం కట్టారు. ప్రజలు ఇలాంటి పార్టీ మనకొద్దని మొన్నటి ఎన్నికల్లో దూరం పెట్టారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో అప్రతిహతంగా అత్యధిక స్థానాలను సాధించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిన బిజెపి, ఈసారి తగిన స్థానాలను దక్కించుకోవడంలో కూడా నిరంకుశ విధానాలు అవలంబించడమే అని నిర్మొహ మాటంగా చెప్పుకోవాల్సిందే. ప్రజాస్వామ్య యుతంగా ఉన్న బిజెపిలో మోడీ నిరంకుశ విధానాలతో పార్టీని దిగజార్చారు. ఎన్‌డిఎ పక్షాలతో ఇప్పుడు ఆ పార్టీ నిలబడ్డా..అదే విధానాలను మోడీ కొనసాగిస్తే..బిజెపి కూడా అంతర్ధానదశకు చేరుకుంటుందని గుర్తించాలి. మోడీ ద్వయం అనుసరించిన నిరంకుశ విధానాల కారణంగా మొన్నటి ఎన్నికల్లో గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో ప్రజలను పట్టించుకోక పోవడంతో ప్రజలు మోడీకి కూడా చెక్ పెట్టేంత పని చేసారు.ఇదో హెచ్చరికగా మోడీ గుర్తించాలి. తాము కోరుకున్న 400 సీట్ల లక్ష్యం సాధించడంలో వెనుక బడడమే గాక, విపక్షాల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది.అందుకే పొత్తు కుదుర్చుకునే అవసరం ఇప్పటివరకు రాకపోయినప్పటికీ, తెలుగుదేశం, జనతాదళ్ యునైటెడ్ పొత్తుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయక తప్పలేదు. దీంతో తెలుగుదేశం, జెడి(యు) పార్టీలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో అత్యున్నత భాగస్వామ్యం పొందే అవకాశం లభించింది. ఈ అవకాశం అన్నిప్రాం తీయ పార్టీలకు లభించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య పరిణామా లు తలెత్తడంతో ప్రస్తుతం బిజూ జనతాదళ్, బహుజన సమాజ్, జననాయక్ జనతా,టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఈ ఐదు ప్రాంతీయ పార్టీల ఉనికి దెబ్బతింది. ఇవి తిరిగి కోలుకుంటాయన్న నమ్మకం కలగడం లేదు. ఈ పార్టీలన్నీ పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే అవకాశాన్ని కోల్పోయాయి. ఈ పార్టీలన్నీ ఒకప్పుడు ముఖ్యమంత్రు లను,ఒకానొక సందర్భంలో పార్లమెంట్ కు విశేష సంఖ్యలో ఎంపిలను పంపించినవేనని గుర్తించాలి. 1997లో బిజూ జనతాదళ్ ఆవిర్భవించిం ది. అప్పటి నుంచి ఎలాంటి ఎదురీత లేని పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో తన ప్రాతినిధ్యం అన్నది లేకుండా పోయింది. మొట్టమొదటిసారి 2009 తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ మెజార్టీ సాధించుకోలేకపోయింది. గత 24 ఏళ్లుగా తిరుగులేని ముఖ్యమంత్రిగా నెగ్గుకుంటూ వస్తున్న నవీన్ పట్నాయక్ ఇప్పుడు పక్కకు తప్పుకోవలసి వచ్చింది.

# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం..

### 41 మంది సజీవ దహనం.. మృతుల్లో భారతీయులు

కువైట్ లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మంగాఫ్ నగరంలో కార్మికులు నివాసం ఉంటున్న ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 40 మందికిపైగా సజీవదహనం అయ్యారు.




మృతుల్లో ఐదుగురు భారతీయులు ఉన్నట్లు కువైట్ మీడియా తెలిపింది. బుధవారం తెల్లవారుజామున కార్మికులు నివానం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. అవి క్షణాల్లో పై అంతస్తు వరకూ వ్యాపించాయి. మంటలకు తోడు దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో అందులో నివసిస్తున్న వారు బయటకు వచ్చేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇప్పటివరకూ 41 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.'అగ్నిప్రమాదం సభవించిన భవనంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉంటున్నారు. ఘటన అనంతరం చాలా మందిని రక్షించాం. కానీ దురదృష్టవశాత్తూ మంటల ధాటికి పొగ పీల్చడం వల్ల చాలా మంది మరణించారు' అని సీనియర్ పోలీస్ కమాండర్ ఒకరు తెలిపారు. సుమారు 50 మందిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సదరు కమాండర్ వెల్లడించారు.

# రుణ మాఫీపై దృష్టి మరల్చేందుకే కాళేశ్వరంపై మీడియాకు లీకులు : జగదీష్ రెడ్డి

సూర్యాపేట : ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు నెలలయింది. ఇచ్చిన హామీల అమలు మరచి గత ప్రభుత్వాల పై నిందలు వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం9 తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ కమిషన్ల ఏర్పాటు పేరుతో డ్రామాలు చేస్తున్నదని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రోజెక్టుల విచారణపై ఆయన స్పందించారు. విచారణ




కమిషన్లు వాటి పని అవి చేసుకుంటాయి. ప్రభుత్వం ఎందుకు లీకులు ఇస్తుందని ప్రశ్నించారు.ఎన్నికల కోడ్ ముగిసాక హామీల అమలు పై ప్రజలు నిలదీస్తారని కమిషన్ల విచారణ పేరుతో మీడియాకు లీకులిస్తూ డ్రామాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పసలేని ఆరోపణలన్నీ వరుసగా తెలిపోతున్నాయి. కాళేశ్వరంలో నీళ్లు నిలిపి సాగు నీరు అందించకుండా తప్పు చేస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలలుగా సమయం వృధా చేసి ఇప్పుడు హడావిడి చేస్తున్నారన్నారు. నీళ్లు, విద్యుత్ విషయంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు.పదేండ్ల క్రితం ఉన్న దుస్థితి మళ్లీ రాష్ట్రంలో దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి విత్తనాల కొరతలో ప్రభుత్వ పెద్దలు పాత్ర ఉందని ఆరోపించారు. పత్తి విత్తనాల బ్లాక్ దందా పై ఓ మంత్రి పాత్ర ఉంది. ఆధారాలు రాగానే త్వరలో పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడిస్తామన్నారు. ప్రభుత్వం చేతగాని తనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం. కమిషన్ల విచారణ పేరుతో రైతు రుణమాఫీపై దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు.

# 'అలా చేస్తే పరీక్ష ప్రతిష్ట దెబ్బతింటుంది'..

### నీట్ యూజీ 2024 కౌన్సెలింగ్‌పై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జూన్ 12: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జూన్ 4న నీట్ యూజీ 2024 ఫలితాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ ఫలితాల్లో దాదాపు 67 మంది విద్యార్థులకు టాప్ ర్యాంకు వచ్చింది.వీరందరికీ 99.997129 పర్సంటెల్ వచ్చింది. ఎంతో కఠినమైన నీట్ పరీక్షలో ఇంత మందికి ఒకే పర్సెంటైల్ రావడం దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో నీట్ యూజీ-2024 పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.




ఈ క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ గత కొన్ని రోజులుగా నిరసనలు వెళు వెత్తుతున్నాయి.దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలైంది. దీనిపై జూన్ 11న విచారణ జరిపిన జస్టిన్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమనుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ నీట్ పరీక్షను క్యాన్సిల్ చేయడం అంత సులువు కాదని, ఇలా చేస్తే నీట్ పరీక్ష ప్రతిష్ట దెబ్బతింటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ ఆరోపణలపై వివరణ కోరుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. అలాగే నీట్ కౌన్సిలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసిన ధర్మాసనం.. ఆలోగా ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.కాగా ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ఫలితాలు జూన్ 4న విడుదలయ్యాయి. తొలుత జూన్ 14న ఫలితాలు వెల్లడిస్తామని చెప్పిన ఎన్టీయే.. అంతకంటే ముందుగానే ఓట్ల ఫలితాల కోసం దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న సమయంలో సరిగ్గా అదే రోజు హడావిడిగా నీట్ యూజీ ఫలితాలు విడుదల చేయడం వివాదానికి దారితీసింది. పైగా ఈ ఫలితాల్లో 67 మందికి ఆలిండియా మొదటి ర్యాంక్ రావడం, వారిలో ఆరుగురు ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన వారై ఉండటం వివాదానికి తెరతీసింది. దీంతో ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ రగడ సుప్రీకోర్టు వరకు వెళ్లడంతో ఎన్టీయేను కోర్టు వివరణ కోరుతూ ఆదేశాలు జారీ చేసింది.

# మీటర్ రీడింగ్ తీసిన విద్యుత్ సిబ్బంది..

### బిల్లు చూసి బిత్తరపోయిన సామాన్యుడు..

హైదరాబాద్, జూన్ 12:ఎప్పటిలాగే ఈ నెల కూడా కరెంట్ రీడింగ్ తీసుకోడానికి ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చి రీడింగ్ తీసి బిల్లు ఇచ్చారు. ఆ బిల్లు చూసిన ఆ ఇంటి యజమానికి గుండె ఆగినంత పనైంది.గృహజ్యోతి పథకం



కింద సబ్సిడీతో రూ.200లలోపు వచ్చే బిల్లు ఈసారి ఏకంగా లక్షల్లో రావడంతో ఆ వ్యక్తి లబోదిబోమన్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటుచేసుకుంది. ఆత్మకూరు మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన డి. పరశురాములు గృహజ్యోతి పథకం కింద విద్యుత్ బిల్లులో సబ్సిడీ పొందుతున్నాడు.అయితే మంగళవారం రీడింగ్ తీసుకోడానికి వచ్చిన ట్రాన్స్‌కో సిబ్బంది రీడింగ్ తీయగా ఒక్క నెలకి ఏకంగా 5,40,927 యూనిట్లు వాడినట్టు రావడంతో ఇంటి యాజమాని అవాక్కయ్యాడు. గృహజ్యోతి కింద సబ్సిడీ వస్తున్న విద్యుత్తు బిల్లు ఏకంగా రూ.6,72,642 రావడం ఏంటని ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించాడు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. రీడింగ్ తీస్తున్న సమయంలో హై ఓల్టేజ్ వచ్చినట్టయితే రీడింగ్ జంప్ అయ్యి పెద్ద మొత్తంలో బిల్లు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అధిక బిల్లు వచ్చిన మీటర్‌ను టెస్టింగ్ కోసం పంపినట్టు ఏఈ వివరించారు.

# మోగిన బడి గంట.. వేసవి సెలవుల తర్వాత ఇవాళ్టి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం



హైదరాబాద్, జూన్ 12: తెలంగాణలో నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. వేసవి సెలవులు జూన్ 11వ తేదీతో ముగిశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పిల్లలతో సందడిగా మారాయి.ప్రభుత్వ బడుల్లో పిల్లల చేరికలను ప్రోత్సహించేందుకు రేవంత్ సర్కార్ బడి బాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం జూన్ 19వ తేదీ వరకు కొనసాగనుంది. స్టేషనరీ, బ్యాగులు, బూట్లు, దుస్తుల కొనుగోళ్లతో పుస్తక దుకాణాలతోపాటు దుస్తుల షాపులు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోతుంటాయి.మరోవైపు తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాలల పని వేళల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ రోజు నుంచి ఉదయం 9 గంటలకే బడి గంట మోగనుంది. ప్రైవేట్ పాఠశాలల్లో 8 గంటలకే తరగతులు ప్రారంభం అవుతుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే 9.30కు మొదలు కావడంపై పాఠశాల విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సమయ పాలనలో పలు మార్పులు చేసింది. ప్రాథమిక పాఠశాలలు సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు సాయంత్రం 4.15 గంటల వరకు పనిచేయనున్నాయి. ఇక హైస్కూళ్లు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి ప్రారంభం అవుతాయి. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పాఠశాలలు ఉదయం 8.45 నుంచి సాయంత్రం 3.45 వరకు పనిచేస్తాయి.అలాగే ప్రతి నెలలో 4వ శనివారం నో బ్యాగ్ డే అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజూ అరగంట పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాల పఠనం, దినపత్రికలు, మ్యాగ్‌జైన్లను చదివించాలని నిర్ణయించింది. టీశాట్ టీవీ పాఠాలను సైతం ప్రసారం చేయనున్నారు. ఈ విద్యాసంవత్సరంలో జనవరి 10వ తేదీ నాటికి విద్యాబోధన పూర్తి చేయాలని అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. కోర్టు తీర్పుపై ఉత్కంఠ

న్యూఢిల్లీ, జూన్ 12:తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.రోజుకో ట్విస్ట్‌తో తెలంగాణలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణలో దూకుడు పెంచిన పోలీసులు.. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్టు చేశారు. ఆరుగురిని నిందితులుగా చేర్చారు. తాజాగా కోర్టులో దాఖలు చేసిన చార్జ్ షీట్‌లో ఈ విషయాలను వెల్లడించారు.మరోవైపు అడిషినల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ ఇంకా విచారించాల్సి ఉన్నందున నిందితులకు బెయిల్ మంజూరు చేయొద్దని కోర్టును కోరారు పబ్లిక్ ప్రాసిక్యూటర్. బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి కావడంతో బుధవారం తీర్పు వెల్లడించనున్నట్టు నాంపల్లి కోర్టు స్పష్టం చేసింది. దీంతో కోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలువురు ప్రతిపక్ష నేతలు, సినీ ప్రముఖులు, రియల్టర్లు, వ్యాపారస్తుల ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు వెలుగులోకి రావడంతో ఈ ఇష్యూని కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, ఈ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల పోలీసులతో రివ్యూ నిర్వహించారు. సీఎం అధికారులతో భేటీ అయిన రెండో రోజే పోలీసులు ఈ కేసుకు సంబంధించిన ఛార్జ్ షీట్ దాఖలు చేయడం ఆసక్తిగా మారింది.

# ప్రమాణస్వీకారం సందర్భంగా సంబరాలు...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు "ప్రమాణస్వీకారం" సందర్భంగా డోన్ పట్టణంలో ఎమ్మెస్సార్ ఆఫీస్ నందు డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ధర్మవరం మన్నే చిన్న నాగిరెడ్డి, యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి టిడిపి నాయకులతో కలిసి సంబరాలు జరుపుకుంటూ స్వీట్లను పంచుకున్నారు .



# చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారానికి హాజరైన సుబ్బారెడ్డి...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్12 విజయవాడ ,కేసరపల్లిలో నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గా "ప్రమాణస్వీకారం" కార్యక్రమానికి హాజరైన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్

# కొండేపి నియోజకవర్గం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు

ఒంగోలు, జూన్ 12, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తూ తెలుగు రాజకీయాల్లో చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో కూటమి 164 స్థానాల్లో గెలిస్తే.. ఒక్క టీడీపీనే 135 సెగ్మెంట్లు సొంతం చేసుకుంది. ఆ 135 మంది ఎమ్మెల్యేల్లో నలుగురు ఒకే నియోజకవర్గ వాసులవ్వడం విశేషం. ఆ నలుగురిలో ముగ్గురు వేర్వేరు నియోజకవర్గాల నుంచి గెలవగా.. ఒకరు అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు.ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గానికి ఆ ఘనత దక్కింది .. 2009 ఎన్నికల ముందు వరకు కొండపి జనరల్ సెగ్మెంట్.. డీలిమిటేషన్‌లో అది ఎస్సీ రిజర్వుడు స్థానమైంది. ఇప్పుడు ఈ నియోజకవర్గానికి చెందిన నలుగురు టీడీపీ నుంచి ఎమ్మెల్యేలుగా ఘన విజయాన్ని అందుకున్నారు. విశాఖపట్నం జిల్లా భీమిలీ నుంచి గెలిచిన మాజీ మంత్రి, గంటా శ్రీనివాసరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిలు ఈ నియోజకవర్గానికి చెందినవారే . ఈ నలుగురిది కొండేపి నియోజకవర్గం కావడం విశేషం.గంటా శ్రీనివాసరావు సొంత ఊరు ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం చింతలపాలెం.. ఆయన విశాఖపట్నానికి వెళ్లి.. అక్కడే సెటిలయ్యారు. విశాఖపట్నంలో వ్యాపారాలు చేసిన గంటా శ్రీనివాసరావు.. ఆతర్వాత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 1999లో టీడీపీ నుంచి అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. గంటా 2004 ఎన్నికల్లో చోడవరం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. 2009 ఎన్నికలకు ముందు ప్రజారాజ్యం పార్టీలో చేరి అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొంది. పీఆర్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో.. కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో తొలిసారి మంత్రి అయ్యారు.2014 ఎన్నికలకు గంటా శ్రీనివాసరావు టీడీపీలో చేరి విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో గంటా విశాఖ నార్త్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఈ సారి మళ్లీ భీమిలీకి షిఫ్ట్ అయి 92,401 ఓట్ల మెజార్టీతో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్‌ని చిత్తు చేసి.. తిరిగి మంత్రి వర్గం రేసులోకొచ్చారు. ప్రతిసారి సెగ్మెంట్ మారినా గెలుస్తూ వస్తున్న ఆయన లక్కీ లీడర్ బ్రాండ్ నిలపెట్టుకున్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం గురించి కొండపిలో ఆయన బంధుగణం కథలుకథలుగా చెప్పుకుంటుంటారు.దామచర్ల జనార్ధనరావు సొంత గ్రామం ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెం.. జనార్ధన్ తాత దామచర్ల ఆంజనేయులు టీడీపీలో సీనియర్ నేత.. మంత్రిగా కూడా పనిచేశారు. ఆంజనేయులు ఆయన 1994, 99లో కొండపి నుంచే విజయాలు సాధించారు. తాత రాజకీయ వారసుడిగా జనార్ధన్ 2010లో టీడీపీ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కొండేపి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో.. తెలుగు దేశం పార్టీ అధిష్టానం ఒంగోలు ఇంఛార్జ్ బాధ్యతల్ని అప్పగించింది.వైసీపీ ఎఫెక్ట్‌తో 2012లో ఒంగోలు ఉప ఎన్నిక జరిగింది. జనార్ధన్ టీడీపీ నుంచి పోటీచేసి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతిలో ఓడిపోయారు. మళ్లీ 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి మాజీ మంత్రి బాలినేనిని ఓడించారు. 2019లో మరోసారి ఒంగోలు నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో ఒంగోలు నుంచి బరిలోకి దిగి. 34,026 ఓట్ల తేడాతో బాలినేనిపై విజయం సాధించారు. అలా ఆ కొండపి లీడర్ రెండోసారి అసెంబ్లీ మెట్లు ఎక్కబోతున్నారు.చీరాల నుంచి గెలిచిన మద్దలూరి మాలకొండయ్యది కూడా కొండిపి నియోజకవర్గమే. ఆయన తెలుగు దేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 2009లో ఒంగోలు ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్నారు. మళ్లీ 2024 ఎన్నికలకు ముందు యాక్టివ్ అయ్యారు. మాలకొండయ్యకు టీడీపీ బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ ఇంఛార్జ్‌గా నియమించింది. ఎన్నికల్లో చీరాల టీడీపీ టికెట్ కేటాయించగా వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌పై 20,894 ఓట్ల తేడాతో విజయం సాధించారు కొండయ్య.

ఆయన మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు.డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఎన్నికల్లో తొలిసారి కొండపి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో మరోసారి పోటీచేసిన ఆయన ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో సైతం వైసీపీని మట్టి కరిపించారు. ఈ సారి 24, 756 ఓట్ల మెజార్టీతో వైసీపీ అభ్యర్థి మాజీ మంత్రి, ఆదిమూలపు సురేష్‌పై ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టి ఎస్సీ కోటాలో మంత్రిగా ఫోకస్ అవుతున్నారు.ఆ నలుగురే కాదు.. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కందుకూరు నుంచి వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, కొండపి, కందుకూరు ఎమ్మెల్యేగా పనిచేసిన సీనియర్ నేత పోతుల రామారావు కూడా కొండపి నియోజకవర్గానికి చెందినవారే కావడం విశేషం.

## ఇక స్థానిక సంస్థలపై గురి

విశాఖపట్టణం, జూన్ 12,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీవిని ఎరుగని విజయాన్ని సాధించిన టీడీపీ కూటమి ఇక స్థానిక సంస్థలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేయొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం ఏపీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్ని ఏకగ్రీవం చేయడంపై పలు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, జడ్పీ పీఠాలను దక్కించుకునే క్రమంలో వైసీపీ అక్రమాలకు పాల్పడిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వానికి ఘర్షణ తలెత్తింది. ఎన్నికల్ని వాయిదా వేసే విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌తో ప్రభుత్వం కయ్యానికి కాలు దువ్వింది. ఆ తర్వాత రకరకాల పరిణామాలు జరిగాయి. కోవిడ్ రెండో దశలో ఉండగా ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహించారు.నాటి ఎన్నికల్లో ప్రధాన కార్పొరేషన్లతో పాటు గ్రేడ్ వన్ మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలు, జడ్పీ పీఠాలను వైసీపీ దక్కించుకుంది. టీడీపీ పోటీ చేసిన స్థానాల్లో అభ్యర్థుల్ని అడ్డుకోడానికి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో టీడీపీ క్యాడర్ మొత్తం చెల్లాచెదురై పోయింది. స్థానికంగా పట్టున్న వాటిని కూడా నిలుపుకోలేక పోయింది.ఈ క్రమంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. వైసీపీ పరాజయంలో ఆ పార్టీ తరఫున స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు. అధికారం ఉందని చెలరేగిపోయారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రజల్ని పీల్చుకుతిన్నారు. పట్టణాల్లో అయితే భవన నిర్మాణాలకు అనుమతి మొదలుకుని, చిన్న చితక పనులు వరకు ఎక్కడ వీలైతే అక్కడ దోచేశారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పోగవడానికి ప్రజా ప్రతినిధులే కీలక పాత్ర పోషించారు.ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా పరిస్థితి తారుమారు కావడంతో స్థానిక సంస్థలకు సారథ్యం వహిస్తున్న నాయకులు పక్క చూపులు మొదలు పెట్టారు. మరో రెండేళ్ల పదవీ కాలాన్ని కాపాడుకోవాలంటే అధికార పార్టీలో చేరిపోవడం మేలని భావిస్తున్నారు. స్థానికంగా లభించే ఆదాయాన్ని వదులకోకూడదంటే అధికార పార్టీని ఆశ్రయించడం మేలని భావిస్తున్నారు. వైసీపీ ఇప్పట్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే పరిస్థితి లేదని చాలామంది నేతల్లో ఉంది.ప్రస్తుతం పదవుల్లో ఉన్న మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు మొదలుకుని కార్పొరేటర్లు, జడ్పీటీసీ సభ్యుల వరకు వీలైనంత త్వరగా అధికార పార్టీలో చేరిపోడానికి రెడీ అవుతున్నారు. ఒంగోలు, నెల్లూరు వంటి నగరాల్లో ఇప్పటికే అలజడి మొదలైంది. సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో కార్పొరేటర్లు భేటీ అయ్యారు.ప్రకాశం జిల్లాలో ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న ఒంగోలులో గత ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. మొత్తం 50 డివిజన్లలో 43 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఆరు డివిజన్లలో టీడీపీ, ఒకచోట జనసేన అభ్యర్థులు గెలిచారు. ఎన్నికల పోలింగ్‌కు ముందే వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 11కి చేరింది.ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ కార్పొరేటర్లతో ఆదివారం మేయర్ తన ఇంట్లో సమావేశమయ్యారు. ప్రస్తుతం వైసీపీకి 39మంది కార్పొరేటర్లు ఉండగా సుమారు 27మంది ఆమెతో సమావేశమయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. కార్పొరేటర్లలో ఎక్కువమంది తమ డిమాండ్లు నెరవేరిస్తే వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. నెల్లూరు, ప్రకాశంతో పాటు రాష్ట్రంలోని అన్ని స?థానిక పీఠాలను వీలైనంత త్వరగా టీడీపీ దక్కించుకునే అవకాశాలు లేకపోలేదు.పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం కంటే చట్టపరంగానే వారిని పదవుల నుంచి తొలగించడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు వైసీపీ ఓటమిలో కీలక పాత్ర పోషించి, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న వారిని ఇప్పుడు టీడీపీలో చేర్చుకుంటే ఆ ప్రభావం పార్టీపై ఎంత మేరకు ఉంటుందనే చర్చ కూడా నడుస్తోంది.చాలా నగరాల్లో మేయర్లుగా మహిళలు ఉన్నా వారి భర్తల పెత్తనం కార్పొరేషన్లలో సాగుతోంది.

## చంద్రబాబు తిరుమల పర్యటనకు పటిష్టమైన భద్రత

తిరుపతి,బుధవారం ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత చంద్రబాబు నాయుడు తిరుమల కు వస్తున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం తిరుమలకు చేరుకుని గురువారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోనున్నారు.ఈ నేపథ్యంలో ఈరోజు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుపతి మీదుగా ఘాట్ రోడ్లు, తిరుమల, గాయత్రి అతిథిగృహం,వైకుంఠంకాంప్లెక్స్, శ్రీవారి ఆలయం వరకు రోడ్డు మార్గాన తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయం లోపల, విఐపి గేటు, పార్కింగ్ ప్రదేశం, గ్యాలరీలను, పరిశీలించి పోలీసు, ఏర్పోర్ట్ భద్రతా సిబ్బంది పాటించవలసిన బందోబస్తు ప్రణాళికను అధికారులకు వివరించారు. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే వాహనాలను పార్కింగ్ చేపించి యాత్రికులకు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# ఇక నుంచి ఇంటి వద్దే రేషన్



నెల్లూరు, జూన్ 12,రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్ని వ్యవస్థల్లో మార్పులు చకచక చేస్తున్నారు. ఇక నుంచి ఇంటి వద్దే రేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రేషన్ డీలర్ల కమిషన్ పెంచేందుకు కూడా సమీక్షలు చేస్తున్నారు. దీంతో పాత పద్ధతినే అమలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.తొలుత రాష్ట్రంలో రేషన్ షాప్‌ల వద్ద రేషన్ ఇచ్చేవారు. రేషన్ డీలర్లు కమిషన్ ప్రాతిపదికన దుకాణాలను నిర్వహించేవారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటింటికీ రేషన్ వ్యవస్థ తీసుకొచ్చారు. రేషన్ డీలర్లకు లబ్దిదారులకు మధ్య మొబైల్ డెలివరీ యూనిట్లను నెలకొల్పారు. రేషన్ డీలర్ల నుంచి బియ్యాన్ని మొబైల్ డెలివరి యూనిట్లలో తరలించి కార్డు దారులకు పంపిణీ చేసేవారు.2021 జనవరి 1 నుంచి గ్రామాల్లోనూ, ఫిబ్రవరి 1నుంచి పట్టణాల్లో ఇంటింటికి రేషన్ పంపిణీ చేసేందుకు వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు.రేషన్ పంపిణీ కోసం మొబైల్ వాహనాలను కూడా కొనుగోలు చేసింది. శ్రీకాకుళం జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఏడాదిగా అమలు చేసి అనంతరం 2021లో రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది.అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికల రావడంతో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఈ పథకాన్ని నిలిపివేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్‌కు లేఖ రాశారు. దీనిపై ప్రభుత్వం సవివరంగా ఎస్ఈసీకి తిరిగి సమాధానం రాసింది.పేదలకు ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ విధి అని, ఇందులో భాగంగానే అర్హత కలిగిన పేదలందరికీ వారి ఇళ్ల వద్దే నాణ్యమైన బియ్యం అందజేసేందుకు ముందుకు అడుగులు వేస్తున్నామని ప్రభుత్వం ఆ లేఖలో పేర్కొంది. దీన్ని అనుమతించాలని కోరింది. అలాగే హైకోర్టు అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు రాజకీయ నాయకులు ఫోటోలు పెట్టకుండా అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఇంటింటికీ రేషన్ పథకం అమలులోకి వచ్చింది.ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయడానికి రూ.538 కోట్లతో 9,260 మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వాహనాలను కొనుగోలు చేసింది. ఒక్కో వాహనం రూ.5,81,190 ధర పడింది. ఒక్కో వాహనానికి డ్రైవర్ కమ్ సప్లైదారుడు ఒకరు, సహాయకుడు మరొకరు ఉంటారు. నిర్ణీత సమయంలో ఇళ్ల వద్దకే వాహనం వెళ్లి రేషన్ సరఫరా చేస్తున్నారు. అయితే నెట్‌వర్క్ సమస్య వల్ల ప్రతి ఇంటికి వాహనం వెళ్లటం లేదు. ఒక దగ్గర వాహనాన్ని ఆపి ఆ ప్రాంతంలోని పది ఇళ్లకు రేషన్ ఇస్తున్నారు. ఆ తరువాత మరొక ప్రాంతంలో ఆపి అక్కడ చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు రేషన్ ఇస్తారు.ఇటీవలి జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. దీంతో గతంలోనే టీడీపీ నేతలు తాము అధికారంలోకి రాగానే రేషన్ షాపుల వద్దే రేషన్ ఇచ్చే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఇంటింటికీ రేషన్ పథకాన్ని రద్దు చేసి, పాత రేషన్ షాపుల వ్యవస్థే రానుంది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అలాగే రేషన్ డీలర్ల కమిషన్ కూడా పెంచేందుకు ప్రభుత్వం సమీక్షిస్తుంది. రేషన్ దుకాణాలు, మొబైల్ డెలివరీ యూనిట్లతో బియ్యం మాత్రమే ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు.ఏపీలో ప్రస్తుతం 2రుపాయలకు సరఫరా చేస్తోన్న బియ్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం కిలోకు రూ.39 ఖర్చు చేస్తోంది. చాలామంది కార్డు దారులు ఈ బియ్యాన్ని రేషన్ వాహనాలకే విక్రయించేస్తున్నారు. వాటిని రీ సైక్లింగ్ చేయడం, ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో బియ్యం స్థానంలో నగదు పంపిణీ చేయాలనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి.చౌకధరల వస్తువుల పంపిణీ వ్యవస్థలో వేల కోట్ల రుపాయలు అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. మొబైల్ డెలివరీ వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత రేషన్ డీలర్లు, ఎండియు యూనిట్లు సిండికేట్‌గా మారిపోయి రాష్ట్ర వ్యాప్తంగా దందాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కార్డు దారులు రేషన్ తీసుకోడానికి ప్రతినెల 15వ తేదీ వరకు అనుమతించే వారు. ప్రస్తుతం నెలలో కేవలం ఒక్క రోజు మాత్రమే అయా ప్రాంతాల్లో బియ్యం పంపిణీ జరుగుతోంది. వాహనం వచ్చిన సమయంలో కార్డుదారుడు లేకపోయినా, వరుసగా మూడు నెలలు బియ్యం తీసుకోకపోయిన కార్డులను రద్దు చేస్తున్నారు.ఈ క్రమంలోనే పౌరసరఫరాల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రధానంగా రాష్ట్రంలోని పోర్టుల నుంచి విదేశాలకు అక్రమంగా జరుగుతున్న బియ్యం రవాణా?పై ఇప్పటికే పూర్తి సమాచారాన్ని విజిలెన్స్ నివేదికలు ప్రభుత్వానికి చేరాయి.

# అన్నీ వేళ్లు జగన్ వైపే

విజయవాడ, జూన్ 12,వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఈ ఎన్నికల్లో ఓటమి చవి చూసింది. గతంలో ఎప్పుడూ చూడని అవమానం ఎదురయింది. అందులో ఎవరిపై వ్యతిరేకత ఉందో.. ఇట్టే అర్థమవుతుంది. ఫలితాలు వచ్చిన తర్వాత వెలువడుతున్న విశ్లేషణలు అన్ని వేళ్లూ జగన్ వైపు చూపుతున్నాయి. 2019 ఎన్నికల్లో అదే జగన్ ఫొటోతో 151 స్థానాలు సాధించిన వైసీపీ, 2024 ఎన్నికలకు వచ్చే సరికి అదే ఫొటో 11 స్థానాలకే పరిమితం చేసింది. దీనికి కారణాలు అనేకం. చెప్పుకుంటూ పోతే చాంతాడంత ఉన్నప్పటికీ కొన్ని మచ్చుకు చెప్పుకోవాల్సిందే. జగన్ వద్దకు వెళ్లే సాహసం ఎవరూ చేయరు. జగన్ కే కాదు ఇప్పుడంటే సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయ్ రెడ్డి మీద ఎమ్మెల్యేలు నెపం నెడుతున్నారు కానీ అసలు ఓటమి కారణం జగన్ దే. చంద్రబాబు వద్ద కూడా నేతలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునేందుకు వీలులేదు. ప్రాంతీయ పార్టీల్లో ఇది సర్వసాధారణం. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి దరిద్రంగా ఉన్నా మొహంపై నవ్వుపులుముకుని ఆల్ ఈజ్ వెల్ అంటూ వెళ్లిపోతారు. లేదు వాస్తవం చెప్పిన వాళ్లకు చివరకు సీటు కూడా దక్కదు. అందుకే నేతల నుంచి ఫీడ్ బ్యాక్ జగన్ కు వస్తుందని అనుకోవడం పొరపాటే అవుతుంది. నిజంగా ధనుంజయ్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితో ప్రమేయం లేకుండా జగన్ ను కలిసినా పార్టీ పరిస్థితి నేతలు చెప్పలేరు. ఎందుకంటే మొహమాటం కాదు..తమ సీటుకు ఎసరు వస్తుందని వారి భయం. అందుకే ఇతరులపై నెపం నెట్టడమనేది ఓటమిని వెతుక్కోవడానికి ఒక కారణాలు.ఓటమి తర్వాత ఇప్పుడు నేతలు అంటున్న కారణాలు వింటుంటే నవ్వొస్తుంది. ఓటమికి గల కారణం వాలంటీర్లు అని చెబుతున్నారు. కానీ అదే వాలంటీర్ల వ్యవస్థను ఇదే నేతలు తెగ పొగిడారు. వాలంటీర్ల వ్యవస్థను తెచ్చి జగన్ విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారంటూ ప్రశంసలు కురిపించారు. అంతేకాదు.. వాలంటీర్ల కారణంగానే గెలుస్తున్నామంటూ ఫలితాల ముందు వరకూ చెప్పుకొచ్చారు. కానీ దారుణ ఓటమి తర్వాత వాలంటీర్ల వ్యవస్థ వల్ల క్యాడర్ పార్టీకి దూరమయిందని, వాళ్లు ఈ సారి సక్రమంగా పనిచేయలేదని సాకులు చెబుతున్నారు. అదే గెలిచి ఉంటే ఇదే వాలంటీర్ల వ్యవస్థను విమర్శిస్తున్న ఇవే నోళ్లు మళ్లీ పొగుడుతూనే ఉండేవి. ఒకవేళ నిజంగా వాలంటీర్ల వ్యవస్థ పార్టీని అంత డ్యామేజీ జరుగుతుందని భావిస్తే జగన్ దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదన్న ప్రశ్న ప్రశ్నగానే మిగులుతుంది.సజ్జల రామకృష్ణారెడ్డి తమను జగన్ ను కలవకుండా అడ్డుపడుతున్నారనుకుంటే తమ అభిప్రాయాలను, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను జిల్లాల పర్యటనలో ఎందుకు తీసుకురాలేకపోయారన్న ప్రశ్నకు కూడా నేతల వద్ద సమాధానం లేదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై అసంతృప్తి వల్లనే ఓడిపోయామని మరికొందరు అంటున్నారు. అంటే ఎమ్మెల్యేలు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులకు కానీ కనీసం దీనిపై ఉప్పందలేదా? రైతులు, భూమి యజమానులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని తెలియలేదా? అసలు ప్రజలతో వారు మమేకం అయి ఉంటే ముందే పసిగట్టేందుకు ఆస్కారం ఉండేది కదా? జగన్ సూచించినట్లు గా గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని సక్రమంగా చేసి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చేదా? అని ఆలోచించుకోవడం మంచిది. సో.. అప్పుడు జగన్ వల్ల గెలిచామన్నది ఎంత నిజమో.. ఇప్పుడు జగన్ వల్లనే ఓడిపోయామన్నది కూడా అంతే నిజం. కొన్ని నిర్ణయాలు ఈ పరిస్థితికి తీసుకు వచ్చాయని చెప్పకతప్పదు.

13, 14 తేదీల్లో సమావేశాలుఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారి వైసీపీ అధినేత జగన్ నేతలతో సమావేశం అవుతున్నారు. ఇప్పటికీ కొందరు నేతలు వచ్చి జగన్ ను కలిసి వెళుతున్నప్పటికీ పార్టీ ఆధ్వర్యంలో జరిగే తొలి సమావేశం మాత్రం 13, 14 తేదీల్లో జరుగుతాయని తెలిసింది

## చిన్నమ్మకు స్పీకర్ పదవేనా..



విజయవాడ, జూన్ 12, లోక్‌సభ స్పీకర్ గా పురంద్రీశ్వరి పేరు ప్రచారంలోకి వచ్చింది. అయితే ఇది సాధ్యమయ్యే అవకాశాలు మాత్రం తక్కువగానే ఉన్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది. సాధారణ పరిస్థితుల్లో అయితే పురంద్రీశ్వరిని స్పీకర్ గా ఎన్నిక చేసేవారు. కానీ ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఆమె పేరు పరిశీలనలోకి రావడం కూడా కష్టమేనన్నది ఎక్కువ మంది అభిప్రాయం. గతంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో బాలయోగి లోక్‌సభ స్పీకర్ గా పనిచేశారు. తర్వాత ఆ స్థానం ఎవరికీ దక్కలేదు. ఇటు యూపీఏ ప్రభుత్వ హయాంలో గాని, అటు ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోని పదేళ్లలో ఆ అవకాశం మాత్రం తెలుగు రాష్ట్రాలకు లభించలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉండటంతో పాటు ఎన్టీఆర్ కుమార్తెగా ఆమెను మోదీ కేబినెట్ లోకి తీసుకుంటారని భావించారు. కానీ టీడీపీ కమ్మ సామాజికవర్గానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ పేరును కేంద్రమంత్రిగా ప్రతిపాదన పంపడంతో అదే సామాజికవర్గం నుంచి ఎంపిక చేస్తే సామాజిక సమతుల్యం సాధ్యం కాదని భావించి మోదీ చివరి నిమిషంలో నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ పేరును తీసుకు వచ్చారు. ఏపీ నుంచి ముగ్గురు ఎంపీలు గెలవగా అందులో శ్రీనివాస వర్మకే కేంద్ర మంత్రి పదవి లభించింది. అనకాపల్లి నుంచి గెలిచిన సీఎం రమేష్ పేరు కూడా ప్రచారంలోకి వచ్చినా ఆయనకు కూడా ఇవ్వలేదు. పురంద్రీశ్వరికి లోక్‌సభ స్పీకర్ గా ఎంపిక చేస్తారనన ప్రచారమయితే జాతీయ, స్థానిక మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. కానీ అది సాధ్యపడే అవకాశాలు తక్కువ అంటున్నారు. ఇప్పుడు బీజేపీకి మ్యాజిక్ ఫిగర్ కన్నా తక్కువ స్థానాలు వచ్చాయి. ఎన్డీఏ కూటమిలోని మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. రానున్న కాలంలో పరిస్థితులు ఎటు పోయి ఎటు వస్తాయో తెలియదు. ఇతర పార్టీల నుంచి ఎంపీలను బీజేపీలోకి తీసుకున్నా, బీజేపీ నుంచి ఇతర పార్టీలకు వెళ్లాలన్నా స్పీకర్ చర్యలు ఉంటాయన్నది వాస్తవం. స్పీకర్ కీలకంగా వ్యవహరిస్తారు. అందుకే తమకు నమ్మకమైన నేతకు బీజేపీ స్పీకర్ పదవి ఇచ్చే అవకాశముందని చెబుతున్నారు. బీజేపీ పాలనలో ఉన్న పదేళ్ల కాలంలో ఫస్ట్ టైం సుమిత్రా మహాజన్ ను ఎంపిక చేయగా, రెండో దఫా ఓంబిర్లాను సెలెక్ట్ చేశారు. ఇద్దరు నేతలు బీజేపీకి అత్యంత విశ్వాసమైన వారు. నార్త్ ఇండియా లాబీయింగ్ ఈ పదవి విషయంలో బలంగా పనిచేస్తుందనే చెప్పాలి. అంకెలు ఇబ్బంది పెట్టే సమయంలో బీజేపీ నాయకత్వం పురంద్రీశ్వరికి స్పీకర్ పదవి ఇచ్చి సాహసం చేస్తుందని అనుకోవడం లేదని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించడం విశేషం. ఎందుకంటే.. స్పీకర్ అయినా తాము చెప్పినట్లు నడిచే వాళు ండారు కానీ వేరే పార్టీల ప్రభావం ఉండని, మిత్రపక్షాలకుచెందిన వారి ఇన్‌ఫ్లూయెన్స్ కూడా ఉండకూడదని సహజంగా భావిస్తారు. పురంద్రీశ్వరి బీజేపీ అయినప్పటికీ, ఆయన టీడీపీ అధినేత చంద్రబాబుతో దగ్గర బంధుత్వం ఉండటం ఆమెను స్పీకర్ గా ఎంపిక చేయకపోవడానికి ప్రధాన కారణమని సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు. అందులో వాస్తవం ఎక్కువగా ఉంది.

## ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన కలెక్టర్



విభారే న్యూస్ కర్నూలు,) జూన్ 12 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి నేపథ్యంలో నాలుగవసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ వేడుకను కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టర్ డా. జి.సృజన వీక్షించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం వద్ద కేసరిపల్లిలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ఏడు చోట్ల జిల్లా యంత్రాంగం ప్రత్యక్ష ప్రసార ఏర్పాట్లు చేసింది. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన రావు, ఇతర జిల్లా అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఆర్ అండ్ బి ఎస్ఈ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, హౌసింగ్ పిడి సిద్ధలింగమూర్తి, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, కలెక్టరేట్లోని వివిధ కార్యాలయాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ కు లక్ష ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయంమానవత్వం చాటుకున్న ఎమ్మిగనూరు క్రీడాకారులు



విభారే న్యూస్ఎమ్మిగనూరు, జూన్ 12... ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ ఆరోగ్య పరిస్థితిపై చలించిపోయారు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన క్రీడాకారులు. నెల రోజులుగా న్యుమోనియాతో బాధపడుతున్న మాబుసాబ్ కు మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్లబ్ (వైఎఫ్ఏ) సభ్యులు కలిసి వైద్యం ఖర్చుల కోసం రూ.లక్ష ఐదు వేల నగదును ఆర్థిక సహాయంగా అందించి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమున్నా బాధిత కుటుంబానికి వైఎఫ్ఎ క్రీడా సభ్యులు అండగా ఉంటామని క్రీడాకారులు భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో వై.ఎఫ్.సి క్రీడా సభ్యులు విక్రమ్, పెద్దఈరన్న, ప్రసాద్, వీరేష్, ముని, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, హనీఫ్, కర్ణకార్ రెడ్డి, శ్రీరాములు, సిజి ఈరన్న, విజయ్, చాంద్, లతీఫ్, నరసింహారాజు లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ లో స్వర్ణశకం అందించే సిఎం గా ప్రమాణ స్వీకారం :- వేల్పుల గోపాల్.

విభారే న్యూస్ కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ వేల్పుల గోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో స్వర్ణశకం ఆరంభమైంది ప్రజలకు బంగారు భవిష్యత్తును ఇచ్చే నారా చంద్రబాబునాయుడు పాలన మొదలైంది భారత ప్రధాని సినీ రాజకీయ ప్రముఖుల సమక్షంలో కోట్లాది ప్రజలు సంబరంగా చూస్తుండగా నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసారు బిజెపి టిడిపి జనసేన ఉమ్మడి ఎన్డీఏ కూటమి భారతీయ జనతా పార్టీ జనసేన టిడిపి ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆశీర్వదించారు జగన్ యొక్క పాలనను చరమగీతం పాడి రాష్ట్ర ప్రజలు సురక్షితంగా సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని రెడ్ల రౌడీ రాజ్యం నుండి రాష్ట్రాన్ని విముక్తి చేస్తాడని చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి వర్యులు పాలనలో రాష్ట్రాన్ని భారత దేశంలో నే నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లి దిశగా ప్రయత్నం చేస్తారని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.



# సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై కలెక్టర్, జెసిలకు కృతజ్ఞతలు

### జిల్లా రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్



విభారే న్యూస్ కర్నూలు జూన్ 12:-సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులను, సిబ్బందిని, సమన్వయం చేసుకొని నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజనను, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావును ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుదవారం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భముగా జిల్లా అధ్యక్షులు గిరి కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి వెంకటరాజు మాట్లాడుతూ సమస్యాత్మక జిల్లాగా పేరొందిన కర్నూలు జిల్లాలో ఎన్నికల విధుల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా నిర్వర్తించేలా అందరిని సమన్వయం చేసుకొని ఎన్నికలు విజయవంతం అయ్యేందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి, ఇతర రెవిన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో నఫలీకృతులయ్యారన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రావు జిల్లా కోశాధికారి, ఆదోని డివిజన్ అధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, కర్నూలు డివిజన్ అధ్యక్షులు రామాంజనేయులు, పత్తికొండ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, మల్లికార్జున కలెక్టరేటు కార్యదర్శి లోకేష్, ధనుంజయరెడ్డి, సుధాకర్, కృష్ణ, వెంకటేశ్వర్లు, ఓంకార్, మహిళా సభ్యులు లోకేశ్వరి, కృష్ణవేణి, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# నవనందుల కోటకు మినిస్టర్ గిరి

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 12- చాలా సంవత్సరాల తర్వాత నవనందుల కోటకు మినిస్టర్ ఛాన్స్ వచ్చిందని పలువురు రాజకీయ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావించునప్పుడు నుంచి ఇప్పటి వరకు అంటి పెట్టుకుని ఉన్న ఎన్ ఎమ్ డి ఫరూక్. గతంలో ఆయన చేసిన పదవులు నలభై ఒక్క సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం. మంత్రిగా, శాసనసభ డిప్యూటి స్పీకర్, మండలి చైర్మెన్గా పని చేశారు. ప్రస్తుతం టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్నారు. అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం. 1981 కౌన్సిలర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఫరూక్ అధికారులు సైకిల్ గుర్తును కేటాయించారు. తన సుధీర్ఘ రాజకీయం సైకిల్ పార్టీ గుర్తు అయిన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతుంది. ఆరు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి నాలుగు సార్లు గెలుపొందారు. రెండు సార్లు ఓటమిని చవి చూశారు. ఎంపిగా రెండు సార్లు పోటీ చేసి ఓటమిని మూటకట్టుకున్నారు. 2004 తర్వాత 2024లో



ఏళ్ల తరువాత ఆరవసారి అసెంబ్లీ బరిలో దిగి గెలుపొందారు. పేరు : నశ్యం మహమ్మద్ ఫరూక్. విద్యార్హత : ఎస్ఎస్ఎల్సి (మెట్రిక్షన్): 15-05-1950పుట్టిన ఊరు : ముసలిమడుగు గ్రామం, కొత్తపల్లి మండలం, నంద్యాల జిల్లా. తల్లిదండ్రులు : ఇబ్రహీం ఖలీల్, జనత్ బీ. పెళ్లిరోజు : 9 జనవరి 1974. భార్య : మహబూబ్ చాంద్సోదరులు : ఇస్మాయిల్, జబ్బార్ మియా, జమాల్ సాహెబ్, ఖుద్దూస్ సోదరీమణులు : రమిజాబీ, జుబేదాబీ, జైబున్ని సా, సలీమున్నిసా, ముంతాజ్ బేగం, మొహిద్దీన్ బీ. కుమార్తె : ఎన్ఎండి ఫర్హానా. కుమారుడు : ఎన్ఎండి పర్వీజ్, ఎన్ఎండి ఫయాజ్, ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫాజిల్, ఎన్ఎండి ఖలీల్. రాజకీయ ప్రవేశం: 1983. ఇష్టమైన నేతలు : ఎన్టీఆర్ చంద్రబాబు నాయుడు.

## కార్మికులకు సిఐటియు ఎల్లప్పుడు అండగా ఉంటుంది...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 12 కార్మికులకు ఎల్లప్పుడూ సిఐటియు అండగా ఉంటుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నాగరాజు అన్నారు. బుధవారం ఫోన్ పట్టణంలోనిస్థానిక కొండపేటలోని మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులుఎ.కుల్లాయప్ప అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు,కోశాధికారి బి.నాగమద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నాగరాజు మాట్లాడుతూ కార్మికులు వారి హక్కుల కోసం చేసే న్యాయమైన పోరాటంలో సిఐటియు ఎల్లప్పుడూ వారికి అండగా ఉండి పోరాడి విజయం దిశగా నడిపిస్తుందని ఆయన అన్నారు. ఈ మధ్యకాలంలో మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు 16 రోజులు సమ్మె చేస్తే సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలను ఏకం చేసి వారికి సంఘీభావాన్ని అందించి చివరి వరకు వారికి అండగా ఉండి పోరాడి ప్రభుత్వము నుండి అనేక డిమాండ్లను సాధించుకోవడం జరిగిందన్నారు. స్థానిక మున్సిపాలిటీ నందు కొన్ని సమస్యలు పరిష్కారం కాక అపరిష్కృతంగా ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 2 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని,అదేవిధంగా రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబంలో కూడా ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ఆయన అన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు, వాహన డ్రైవర్లకు స్కిల్డు,సెమి స్కిల్డు వేతనాలు 24,500రూపాయలు చెల్లించాలన్నారు. అనంతరం 17 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీగౌరవాధ్యక్షులుగా టి.శివరాం సిఐటియు,అధ్యక్షులుగా కె.పెద్ద ఎల్లయ్య,ప్రధాన కార్యదర్శిగా ఎ.కుళాయి స్వామి,ఉపాధ్యక్షులుగా కె.గోవిందు,నాగరాజు,సహాయ కార్యదర్శులుగా పి.దేవదానం, బి.ఆవులయ్య,కోశాధికారిగా ఎం.హైమారావు,కమిటీ సభ్యులుగా సి.యేసురత్నం, ఎ.ఓబులేసు,జి.పి. రామాంజనేయులు,ఎం.సురేష్, మద్దయ్య,ఎం.చంద్ర,చాపల రామాంజి,వై.సురేష్, రంగనాయకులమ్మ.వెంకటలక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రివర్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన వాసవి మాత ముద్దుబిడ్డ..



ఎమ్మిగనూరు విభారె న్యూస్ జూన్ 12..గత మే నెలలో జరిగిన ఎన్నికలలో కర్నూలు ఎమ్మెల్యేగా టి.జి.భరత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. అందులో భాగంగా బుధవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా గెలిచిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ టీ.జీ. భరత్ కు మంత్రి పదవిని చేకూర్చారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా వైశ్యుల నుండి రాష్ట్రంలో కేటాయించిన ఒకే ఒక్క మంత్రి పదవి భరత్ కు చంద్రబాబు కేటాయించారు. రాష్ట్ర మంత్రివర్యులు టి.జి. భరత్ కు ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘం, ఆవోపా సంఘము, ఆర్యవైశ్య మండల సంఘం తదితర ఎమ్మిగనూరు ఆర్యవైశ్య సంఘములన్నియు ముక్త కంఠం తో టీజీ భరత్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వాసవి మాత ముద్దుబిడ్డ టీజీ భరత్ ముందు ముందు రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వాసవి మాత ఆశీర్వాదంతో రాజకీయంగా రాణించాలని అందరూ వాసవి మాతను కోరారు.

## రాయితీ పై జీలుగలు పంపిణీ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 12- నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో వ్యవసాయ అధికారులు రాయితీ పై జీలుగలు పంపిణీ చేశారు. బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి వై. వి.మురళీ కృష్ణ . పెద్ద కొట్టాల రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి అక్కడ గల గ్రామ వ్యవసాయ సహాయకురాలి యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షించి ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి గ్రామానికి కావాల్సిన విత్తన మరియు ఎరువుల పై ప్రణాళిక రూపొందించవల్సిందిగా తెలియచేసారు. అలాగే గ్రామంలోని రైతులతో కలిసి ఖరీఫ్ పంటలకు సంబంధించి గ్రామంలోని స్థిగతులను తెలుసుకొని పలు సూచనలు చేశారు . గ్రామంలోని రైతులకు పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహయ వ్యవసాయ అధికారి రాజశేఖర. మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు .

## సీఎం ప్రమాణ స్వీకారం వీక్షించిన కలెక్టర్. జేసీ



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 12- బుధవారం కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో. భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ, రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ సమక్షంలో... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గౌరవ నారా చంద్రబాబు నాయుడు గారు. అనంతరం రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన నంద్యాల పట్టణ ఎమ్మెల్యే శ్రీ ఎన్ఎండి ఫరూక్ , బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి. నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ నుండి లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించిన జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు , జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి ఎ. పద్మజ , మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి , నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్ రెడ్డి తదితరులు ఉన్నారు .

## "మేడం. సీ" కి కుప్పం రెడ్డమ్మ అవార్డు



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 12-నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, రచయిత కాశీపురం ప్రభాకర్ రెడ్డి రాసిన “మేడం. సి “ అనే నవలకు కుప్పం రెడ్డమ్మ స్మారక రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది . బుధవారం చిత్తూరు లో చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో రెడ్డమ్మ ట్రస్ట్ అధ్యక్షురాలు డా కె. రామలక్ష్మి ఈ అవార్డు అందించారు. క్రికెట్ నేపథ్యంలో వచ్చిన ఈ నవల లో రాయలసీమ సంస్కృతి గొప్పదనాన్ని అద్భుతంగా వివరించారని వక్తలు పేర్కొన్నారు. రచయిత ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం ఏడాది కాలం లోనే మూడు ముద్రణలకు నోచుకుని పాఠకులను విశేషంగా అలరిరిస్తోంది అని అన్నారు. నంద్యాల జిల్లా లోని కుకూ యప్ లో ప్రసారం అవుతోన్న మొట్ట మొదటి నవల మేడం.. సి. అని కేవలం 40 రోజుల్లో దాదాపు 10వేల మంది శ్రోతలు వినడం ద్వారా రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు కట్టమంచి బాల కృష్ణా రెడ్డి, ప్రముఖ రచయితలు ముని సురేష్ పిళ్ళే, ఎం ఆర్ అరుణ కుమారి, రోహిణి వంజారి, డా సుగుణ రావు, నంద్యాల జిల్లా జర్నలిస్ట్ ల సంఘం ఎపియుడబ్యుజే గౌరవాధ్యక్షులు ఎం. జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మంత్రి బి.సి కి శుభాకాంక్షలు తెలిపిన సుబ్బారెడ్డి...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-జూన్ 12 ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే భాగస్వామ్య కూటమి మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన బి.సి.జనార్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అనంతరం ఎమ్మెల్యేలు అమర్నాథ్ రెడ్డి, ధూళీపాళ్ల నరేంద్ర గార్ల లను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190